స్కూళ్లా.. సూపర్‌మార్కెట్లా..!

- నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ విక్రయం
- సైదాబాద్ జోన్ పరిధిలో ప్రైవేట్ పాఠశాల గది సీజ్

సైదాబాద్, జూన్ 19 : ప్రైవేట్ పాఠశాలలు ప్రజలను నిలువు దోపిడీ చేసే వ్యాపార సంస్థలుగా మారాయి. ఒకవైపు ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూ.. మరోవైపు పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ విక్రయిస్తూ సూపర్ మార్కెట్లుగా మారి దోచుకుంటున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులకు ఇష్టం లేకున్నా తమ పాఠశాలలోనే పుస్తకాలను కొనుగోలు చేయాలని ఒత్తిడి యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నాయి.

విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం, నిఘా వైఫల్యంతో పాటు వారి అవినీతి కారణంగా సైదాబాద్ జోన్ పరిధిలో ప్రైవేట్ స్కూల్స్ సూపర్ మార్కెట్స్‌లా మారాయి. పాఠ్యపుస్తకాలను, నోట్‌బుక్స్, యూనిఫాంను పాఠశాలల్లో యథేచ్ఛగా విక్రయిస్తున్నాయి. బుధవారం సెయింట్ ఆండ్రూస్ పాఠశాల ఆవరణలో పాఠ్యపుస్తకాలను విక్రయిస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదుతో సైదాబాద్ విద్యాశాఖ అధికారులు ఆ పాఠశాలలో పుస్తకాల గదిని సీజ్ చేశారు.

సైదాబాద్ జయనగర్‌లో సెయింట్ ఆంధ్రూస్ పాఠశాలలో విక్రయిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్

పాఠశాల గదిలో స్కూల్ యూనిఫామ్ విక్రయిస్తున్న సిబ్బంది

సూపర్‌మార్కెట్లను తలపిస్తున్న పాఠశాలలు

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నర్సరీ నుంచి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలను, యూనిఫాం, నోట్‌బుక్స్‌ను పాఠశాల ఆవరణలోనే ప్రత్యేక రూమ్‌ల్లో విక్రయిస్తున్నాయి. పెన్సిల్ నుంచి టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, షూ, సాక్స్, టైలు, యూనిఫాం వరకు అన్నీ విక్రయిస్తూ సూపర్ మార్కెట్లుగా దర్శనమిస్తున్నాయి. తమ పబ్లిషర్స్ బుక్స్ బయట ఎక్కడా దొరకవని ఇక్కడే కొనుగోలు చేయాలని, బయటి బుక్స్‌ను తాము అనుమతించమని ఖరాఖండిగా చెబుతూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నాయి.

పుస్తకాలు విక్రయించే పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలి : బీఆర్ఎస్

నిబంధనలకు విరుద్ధంగా టెక్స్ట్ బుక్స్, నోట్‌బుక్స్‌తోపాటు ఇతర వస్తువులను విక్రయిస్తున్న ప్రైవేటు పాఠశాలలను గుర్తించి తక్షణమే వాటి గుర్తింపును రద్దు చేయాలని బీఆర్ఎస్ సైదాబాద్ డివిజన్ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ, పాఠ్యపుస్తకాల పేరుతో వేలాది రూపాయలను దండుకుంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 19: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్, బీపీఈడీ, డీపీఈడీ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి, వచ్చే నెల 1లోగా టీఏస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ. 200 అపరాధ రుసుముతో 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 3లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చని తెలిపారు.

'నీట్'పై సమగ్ర విచారణ చేపట్టాలి

చాదర్‌ఘాట్, జూన్ 19: వైద్య విద్య ప్రవేశ పరీక్ష కోసం నిర్వహించే 'నీట్' పరీక్షల్లో చోటుచేసుకున్న అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని జాతీయ మాలల ఐక్య వేదిక గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కారింగుల మారుతి అన్నారు. ఎన్టీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థుల భవిష్యత్ ఆగమ్యగోచరంగా మారిందని, కేంద్ర ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నదని ఆయన దుయ్యబట్టారు. ఈ పరీక్షలో పేపర్ లీకేలు జరగడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. కష్టపడి చదిన విద్యార్థులకు న్యాయం జరిగేలా విద్యార్థి లోకానికి అండగా ఉంటామని మారుతి స్పష్టం చేశారు.

బీజేపీ యాకుత్‌పురా నియోజకవర్గ కన్వీనర్‌గా బండ వెంకట్‌రెడ్డి

బండ వెంకట్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న సురేందర్‌రెడ్డి

మాదన్నపేట, జూన్ 19: బీజేపీ యాకుత్‌పురా నియోజకవర్గ కన్వీనర్‌గా కుర్మగూడకు చెందిన బండ వెంకట్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బండ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ యాకుత్‌పురా నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, సహదేవ్ యాదవ్, వీరేందర్‌బాబు, చంద్రశేఖర్, ధీరజ్, మహేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి మృతికి కారణమైన యువకుడికి పదేండ్ల జైలుశిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టులు,జూన్19(నమస్తే తెలంగాణ): నిర్లక్ష్యంగా ద్విచక్రవాహనం నడిపి వ్యక్తి మృతికి కారణమైన నిందితుడు వానరాసి ప్రశాంత్(19)కు పదేండ్ల జైలుశిక్ష రూ. 13వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 9వ అదనపు జిల్లా న్యాయస్థానం తీర్పు నిచ్చింది. అదనపు పీపీ రఘు కథనం ప్రకారం.. కీసర మండలం కర్రిగూడేనికి చెందిన యాదయ్య భార్య, మనవరాలితో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కడ్తాల్ గ్రామ శివారులో నిందితుడు ప్రశాంత్ బైక్‌పై అతివేగంగా వచ్చి వారి బైక్‌ను ఢీకొనడంతో యాదయ్యాకు తీవ్రగాయలతో అక్కడికక్కడే మృతిచెంచగా అతడి భార్య, మనవరాలు తీవ్రంగా గాయపడ్డారు. యాదయ్య భార్య కడ్తాల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిపై, బైక్ యజమానిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. సాక్షాధారాలను పరిశీలించిన న్యాయస్థానం డ్రైవర్‌కు పదేండ్ల జైలు శిక్ష, బైక్ యజమాని లలితకు రూ. 3వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది.

ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి

మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్

సైదాబాద్, జూన్ 19 : రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ కోరారు. బుధవారం సైదాబాద్ కల్యాణ్‌నగర్‌కాలనీలోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు కేటాయించాలని విద్యా హక్కు చట్టం చెబుతుందని, వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస వసతులను కల్పించకుండా, యాజమాన్యాలు వేలాది రూపాయలను ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో వారు ఇష్టానుసారంగా ఫీజులను వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అధిక ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలని, ప్రభుత్వమే ఫీజులను నిర్ణయించాలని, ఫీజుల వివరాలను నోటీసు బోర్డుపై ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఏటా ఫీజులు పెంచుతున్న ప్రైవేటు పాఠశాలలను గుర్తించి వాటిని రద్దుచేయాలని కోరారు. అదేవిధంగా విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, తరగతి గదుల్లో సేఫ్టీ చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని వినతిపత్రం ద్వారా కోరినట్లు ఆయన తెలిపారు. విద్యాహక్కు చట్టం అమలుకు ప్రభుత్వం స్పందించకుంటే న్యాయపోరాటం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్, జూన్ 19 : పేదల జీవితాల్లో షాదీ ముబాకర్, కల్యాణలక్ష్మి పథకాలు వెలుగులను నింపుతున్నాయని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. బుధవారం పాతబస్తీ ఫంజేషాలోని తన కార్యాలయంలో సైదాబాద్, చావుని, మూసారాంబాగ్ డివిజన్లలోని పలు ప్రాంతాలకు చెందిన 83 మంది మహిళలకు మంజూరైన షాదీ ముబాకర్, కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. పేదలు తమ ఆడబిడ్డలకు పెండ్లి చేసేందుకు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి పథకాలతో ఎంతోమంది లబ్ధిపొందుతున్నారని అన్నారు. దళారీలు లేకుండానే లబ్ధిదారుల అకౌంట్లలో నేరుగా డబ్బులు జమవుతున్నాయన్నారు. 83 మంది లబ్ధిదారులకు 83 లక్షల 628 రూపాయల విలువైన చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో చార్మినార్, సైదాబాద్ మండలాల రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలి

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ పారిజాతనర్సింహారెడ్డి

బడంగ్‌పేట,జూన్ 19: మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాతనర్సింహారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి సాయిబాలాజీ ఫేస్–1 కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఏర్పాటు చేసిన బ్యూటీషియన్ శిక్షణను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ మోహన్‌సింగ్

నేరేడ్‌మెట్, జూన్ 19: మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిందీ విభాగం, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల హిందీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ మోహన్‌సింగ్ వ్యక్తిత్వం, రచనలు, చర్చలు అనే అంశంపై బుధవారం ఉస్మానియా యూనివర్సిటీలో జాతీయ సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి హాజరై మాట్లాడుతూ ఆచార్యమోహన్ సింగ్ బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయనను అభివర్ణించారు. కాకతీయ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ సాయన్న, ప్రొఫెసర్ అర్జున్‌రావు, రాజేందర్‌సింగ్, మహమూద్, మాణిక్యాంబ, వేణుగోపాల్‌రెడ్డి, బాలాజీసింగ్, సదస్సు కన్వీనర్ డాక్టర్ జగన్ పాల్గొన్నారు.

పైపులైన్ పనులను త్వరగా పూర్తి చేయండి

సమస్యలపై డీజీఎం మాధవికి వినతిపత్రం అందజేస్తున్న నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ

మన్సూరాబాద్, జూన్ 19: యూజీడీ పైపులైన్ల పనులను త్వరగా పూర్తి చేసి వర్షాకాలంలో ప్రజల ఇబ్బందులు తీర్చాలని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ సంబంధిత అధికారులకు సూచించారు. నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎస్‌బీ అధికారులతో కార్పొరేటర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మ్యాన్‌హోల్స్, నాలాల్లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి కాలనీల్లో మురుగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. లోతట్టు కాలనీల్లో వరద ముంపు సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీజీఎం మాధవి, జలమండలి మేనేజర్ ప్రేమ్‌కుమార్, అర్చన, ఏఈ రాకేశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సూపర్‌వైజర్లు రమేశ్, హుస్సేన్, నాయకులు ఐలయ్య, నరేందర్‌రెడ్డి, మనోజ్, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాలలను సద్వినియోగం చేసుకోవాలి

హోమియోపతి వైద్యశాల ఆవరణలో పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూన్ 19 : ఎన్జీవోస్ కాలనీలోని ప్రభుత్వ హోమియోపతి, యునానీ వైద్యశాలల్లో సేవలను సద్వినియోగం చేసుకోవాలని బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. బుధవారం ఆయా దవాఖానలను ఆయన సందర్శించారు. పరిసరాల్లో పెరిగిన మొక్కలు, పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య సిబ్బందితో తొలగింపజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హోమియోపతి, యునానీ ప్రాచీన వైద్య విధానాలన్నారు. ఎన్నో వ్యాధులకు సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా పరిష్కారం చూపుతాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నర్మద, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి

ఘట్‌కేసర్,జూన్19: ఇంజినీరింగ్ విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే నైపుణ్యం పెంచుకునేందుకు కృషి చేయాలని గ్రాడియోస్ టెక్నాలజెస్ కంపెనీ కో ఫౌండర్ మధుసూదన్ అన్నారు. ఘనాపూర్‌లోని కేపీఆర్‌టీ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం గ్రాడియోస్ టెక్నాలజెస్ కంపెనీ కళాశాల ఇంజినీరింగ్ విద్యార్థుల నైపుణ్యం, ఉపాధి కోసం బుధవారం ఒప్పందం చేసుకున్నారు. కళాశాల డైరెక్టర్ దివ్యశ్రీ,ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు, ప్రొఫెసర్ సోహిని రాయ్, ఏఓ నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

22 నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మన్సూరాబాద్, జూన్ 19: దిల్‌సుఖ్ నగర్ కోదండరాంనగర్‌లోని అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 22 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బిచినేపల్లి లక్ష్మీనరసింహారావు తెలిపారు. వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 25న స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి గంధం వెంకటేశ్వర్లు, కోశాధికారి నరసింహ, బీ. వెంకటేశ్వర్లు, నారాయణమూర్తి, లక్ష్మణరావు, రామకృష్ణయ్య, జగన్మోహన్‌రెడ్డి, పాల్తి శ్రీనివాస్, ఎస్టీ చారి, సత్యనారాయణమూర్తి, సూర్యనారాయణరెడ్డి, పూజారి కారంపూడి వెంకటవరదాచార్యులు పాల్గొన్నారు.

ఎంఈడీ పరీక్షా తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 19: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24, 26 తేదీల్లో జరుగనున్న ఎంఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెల 1, 3 తేదీల్లో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఇతర వివరాలకు www. osmania.ac.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఇస్మాయిల్

ఇస్మాయిల్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న మిద్దెల జితేందర్

ఆర్కేపురం, జూన్ 19 : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆర్కేపురం డివిజన్‌కు చెందిన సయ్యద్ ఇస్మాయిల్ నియమితులయ్యారు. ఈ మేరకు సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఉత్తర్వులు జారీ చేసి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సయ్యద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులకు అందేలా కృషి చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన మిద్దెల జితేందర్, సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బ్రాడ్‌వే కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలి

మేడ్చల్, జూన్ 19 : మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో ఉన్న బ్రాడ్‌వే కాలనీ నీటి సమస్యను పరిష్కారానికి కృషి చేయాలని కమిషనర్‌ను స్థానికులు కోరారు. ఈ మేరకు బుధవారం కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన కమిషనర్ వచ్చే పాలకవర్గ సమావేశంలో స్థానిక కౌన్సిలర్‌తో మాట్లాడి, బడ్జెట్ కేటాయిస్తామని తెలిపారు. బీజేపీ పట్టణ కార్యదర్శి జాకట ప్రేమ్‌దాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

మన్సూరాబాద్, జూన్ 19: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం కాంగ్రెస్ పార్టీ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు బుడ్డ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ రింగ్‌రోడ్డులో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యకర్తల సమక్షంలో సత్యనారాయణ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మంజులారెడ్డి, పుల్లయ్య, పృథ్వీరాజ్, అక్రమ్,జైపాల్‌రెడ్డి, రోజారెడ్డి, ప్రకాశ్, రమేశ్, కేవీఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి

బండ్లగూడలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను బండ్లగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు చెరుకు భవానీ గౌడ్, సహదేవ్, పంగ గౌతమ్, రాఘువేందర్ గౌడ్, అరవింద్, అఖిల్‌గౌడ్, వంశీ, ప్రవీణ్, అరుణ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు : రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలను జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైస్ ఎంపీపీ గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో కేక్ కట్ చేశారు. స్వీట్లను పంచిపెట్టారు. కార్యక్రమంలో సొడపు వెంకటేశ్‌గౌడ్,రాణాప్రతాప్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, అఫ్జల్ బేగ్, ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్,పాండు గౌడ్, దేవేందర్‌రెడ్డి, మొయినోద్దిన్,కుమార్, సాయిలు, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట : కేక్ కట్ చేస్తున్న మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

కందుకూరులో కేక్ కట్ చేస్తున్న జంగారెడ్డి, శమంతప్రభాకర్‌రెడ్డి

మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో..

బడంగ్‌పేట : మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ, జల్‌పల్లి, బడంగ్‌పేట, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలను అనాథాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. నాదర్‌గుల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మేయర్ పారిజాతనర్సింహారెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, దర్శన్ రెడ్డి, బాలకిషన్, తదితరులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్‌లో...

చంపాపేట : కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలను బుధవారం సరూర్‌నగర్ ప్రైమరీ స్కూల్‌లో ఆపార్టీ లింగోజిగూడ సీనియర్ నాయకుడు కందికంటి శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో కేక్ కట్ చేయించారు. అనంతరం 200 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పీ. సత్యనారాయణ, మల్లికార్జున్, వెంకట్‌రెడ్డి, రాజు ఎండీ జాఫర్, ఎండీ షౌకత్, సర్వర్, రాకేశ్, పాల్గొన్నారు.

చిన్నారులకు పండ్లు పంపిణీ

మలక్‌పేట : ఎంపీ రాహుల్‌గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్ బోనగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సంజీవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ధన్వంత్, ప్రభాకర్‌చారి, మల్లేశ్, మురళీమోహన్ పాల్గొన్నారు.

సంజీవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న బోనగిరి చంద్రశేఖర్, ధన్వంత్ తదితరులు

కాలనీల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

ఏపీఏయూ కాలనీలో మ్యాన్‌హోల్స్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ, తదితరులు

సైదాబాద్, జూన్ 19 : కాలనీల్లో సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఏపీఏయూ కాలనీలో జలమండలి అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో మ్యాన్‌హోల్స్ కుంగిపోయాయని, మరికొన్ని చోట్ల పైకప్పులు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కాలనీవాసులకు ఇబ్బందులు కలగకుండా మురుగునీటి వ్యవస్థను ఆధునీకరించాలన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలను సంక్షేమ సంఘం అధ్యక్షుడు మడిగాల విజయభాస్కర్‌రెడ్డి కార్పొరేటర్, జలమండలి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలో నూతనంగా సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని, పచ్చదనం పరిరక్షణకు ప్రత్యేకంగా కృషి చేయాలని ఆయన కోరారు.

కార్యక్రమంలో సైదాబాద్ జలమండలి సెక్షన్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, హార్టీకల్చర్ సూపర్‌వైజర్ రవి, మహేశ్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏవీఎన్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

హయత్‌నగర్‌లోని ఏవీఎన్ స్కూల్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హయత్‌నగర్, జూన్ 19 : సీబీఎస్ఈ అనుమతి లేకుండా అడ్మిషన్లు తీసుకొని విద్యార్థుల తల్లిదండ్రులను మోసగిస్తున్న ఏవీఎన్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లోని ఏవీఎన్ స్కూల్ ఎదుట బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఏవీఎన్ స్కూల్ యాజమాన్యం స్టేట్ పర్మిషన్ తీసుకొని సీబీఎస్ఈ అడ్మిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు స్టాలిన్, అరుణ్, వంశీ, సాయి, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

కాగా ఎస్ఎఫ్ఐ నాయకుల ఆందోళన విషయం తెలుసుకున్న స్కూల్ యాజమాన్యం, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి గన్‌మెన్లతో వారిని బెదిరించారని శివకుమార్ ఆరోపించారు. తోపులాటకు దిగి దాడికి యత్నించారని పేర్కొన్నారు. విద్యాధికారులు వెంటనే స్పందించి స్కూల్ యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులు పరిశీలన

ఉప్పల్, జూన్ 19: ఉప్పల్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా కాలనీవాసులతో కలిసి పర్యటించి, సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు, వరద ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. వరద నీటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కె.సతీష్, బజార్ జగన్నాథ్, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, జగన్, విజయేందర్, పాండు, కుమారస్వామి, సోమయ్య, విజయభాస్కర్, స్వామి, రామకృష్ణ పాల్గొన్నారు.